ప్రజాశక్తి

ఆదివారం 7 ఆగస్టు 2025 5 విజయనగరం



ఎరువుల సరఫరాపై నేడు డయల్ యువర్ కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎరువుల సరఫరాపై రైతు సమస్యలను తెలుసుకునేందుకు, వారినుంచి సూచనలు, సలహాలను స్వీకరించేందుకు ఆదివారం డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 గంటలు నుంచి 1 గంట మధ్య 9441957315 నెంబరుకు ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుత పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా జిల్లాలో తగినంతగా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్‌బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 1122 మెట్రిక్ టన్నుల యూరియా ఎస్ఎస్‌కెల్లో, ప్రయివేటు వర్తకుల వద్దా సిద్ధంగా ఉందని తెలిపారు. సోమవారం మరో 850 టన్నులు, గురువారం వెయ్యి టన్నులు యూరియా జిల్లాకు రానుందని తెలిపారు. ఈ నెలాఖరుకు మరో 3వేల మెట్రిక్ టన్నులు వస్తుందని తెలిపారు. ఇది జిల్లా అవసరాలకు సరిపోతుందని,రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు క్షేత్రస్థాయిలో ఉండి యూరియా పంపిణీని ఎంపిడిఒలు, తాహశీల్దార్లు పర్యవేక్షించాలని ఆదేశించినట్లు తెలిపారు.

నిర్బంధాలను ఎదుర్కొంటూ.. కార్మికులకు అండగా నిలుస్తూ...





మహాసభకు సిద్ధమైన వేదిక

- నేడు, రేపు రాజాంలో సిఐటియు 11వ జిల్లా మహాసభ
- హాజరుకానున్న సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్ నర్సింగరావు, సుబ్బరావమ్మ
- ఎర్రజెండాలతో రెపరెపలాడుతున్న రాజాం పట్టణం

కార్మికులకు అండగా... శ్రమజీవులకు శక్తిగా... చిరుద్యోగుల గుండె చప్పుడుగా అనేక పోరాటాలు, ఎన్నో విజయాలు, మరెన్నో ప్రగతిశీల లక్ష్యాలతో ముందుకు సాగుతున్న సిఐటియు మరో అడుగు ముందుకు వేస్తోంది. ఓవైపు పెట్టుబడిదారులు, కార్పొరేట్‌శక్తుల శ్రమదోపిడీ, ఉద్యోగులపై వేధింపులు పెరుగుతుండగా, మరోవైపు ఎర్రజెండా నీడలో సిఐటియు ఆధ్వర్యాన జిల్లాలో పోరాటాలు ఉధృతంగా సాగుతున్నాయి. ఈనేపథ్యంలో ఈనెల 7,8 తేదీల్లో (ఆది, సోమవారాల్లో) సిఐటియు జిల్లా 11వ మహాసభలకు రాజాంలోని శ్రీసాయి నటరాజ్ కల్యాణ మండపం వేదిక కానుంది. దీనికి ముందుగా రాజాం ఆర్‌టిసి కాంప్లెక్స్‌నుంచి మహాసభలు జరిగే ప్రాంగణం వరకు భారీ సంఖ్యలో కార్మికులు ప్రదర్శన నిర్వహించ నున్నారు. ప్రారంభ సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ ప్రసంగించనున్నారు. ఈనేపథ్యంలో బహిరంగ సభ, ప్రతినిధుల సభ జరగబోయే ప్రదేశాలు సిఐటియు జెండాలతో ఎర్రబారాయి. కార్మికుల హడావుడి, ఎర్రజెండాల తోరణాలతో రాజాం పట్టణంలో కార్మికవర్గంలో పండగ వాతావరణం నెలకొంది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ నాయకత్వంలో మహాసభకు ఏర్పాట్లు చేశారు.

ప్రజాశక్తి-విజయనగరంప్రతినిధి/రాజాం

గడిచిన మూడేళ్లకాలంలో జిల్లాలోని సంఘటితర, అసంఘటిత రంగ కార్మికులు, చిరుద్యోగులు, స్కీమ్ వర్కర్లు తదితరులు గడ్డుపరిస్థితులు ఎదుర్కొన్నారు. అదే స్థాయిలో సిఐటియు నాయకత్వంలో కార్మికులు పెద్దఎత్తున ఉద్యమించారు. కొత్తగా పరిశ్రమలు రాలేదుగానీ, జిల్లాలోని చాలా వరకు పరిశ్రమలు మూతపడ్డాయి. గజపతినగరం ఓలాం జీడిపిక్కల పరిశ్రమ 2022లో గరివిడి ఫేకర్ మూత, కొత్తవలస జిందాల్, చిన్నాపురం ఎ.ఎస్.జ్యూట్ మిల్, బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో పరిశ్రమలు మూతపడ్డాయి. ఫలితంగా సుమారు 15వేల మంది కార్మికులు జీవనోపాధి కోల్పోయారు. జిల్లా పారిశ్రామిక అభివృద్ధి కూడా మందగించింది. మరోవైపు ప్రభుత్వం అవలంభిస్తున్న మోసపూరిత విధానం వల్ల ఉద్యోగ భద్రత, పనికి తగ్గ వేతనం లేదు. పని ఒత్తిడి ఎక్కువైంది. ఈనేపథ్యంలో ప్రభుత్వ శాఖలు, సంస్థల్లోని కాంట్రాక్టు, ప్రైవేటు ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు తమకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాడారు. ముఖ్యంగా అంగన్వాడీల 42రోజుల సమ్మె, సమగ్ర శిక్షా ఉద్యోగుల 22రోజుల సమ్మె, మున్సిపల్ 16రోజుల సమ్మె, మిమ్స్ ఉద్యోగులు 60రోజుల సమ్మె, కొత్తవలస జిందాల్ పరిశ్రమ జెఎసి పోరాటం 65 రోజులు, గరివిడి ఆక్సెడ్ ప్లాంట్ పోరాటం 70రోజులు, రామభద్రపురం, గజపతినగరం, ఎస్.కోట, గరివిడి పంచాయతీ కార్మికుల సమ్మె, చీపురుపల్లి కర్లాం పౌల్ట్రీ కార్మికుల తొలగింపుపై ఆందోళనలు, ఆశా, విఆర్ఎ, గ్రీన్ అంబాసీడర్స్, మధ్యాహ్న భోజనం, భవనం, స్కూల్ ఆయాలు, మెడికల్ రిప్స్, ఆర్‌టిసి, హెల్త్ సెక్రటరీలు, 108, 104 ఫీల్డ్ అసిస్టెంట్స్, పెన్షనర్స్, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై పెద్దఎత్తున కదిలారు. వీరందరికీ సిఐటియు అండగా నిలుస్తూ సమస్యలపై రాజీలేని పోరాటం చేసింది. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవల్ల జరుగుతున్న కష్టనష్టాలను కార్మికవర్గానికి వివరిస్తూ, చైతన్యపరుస్తూనే సమస్యల పరిష్కారానికి ఉద్యమాలను తీవ్రతరం చేసింది.

సిఐటియు ముఖ్యమైన పోరాటాలు - ఫలితాలు

- అంగన్వాడీలు 42 రోజుల సమ్మె కాలంలో 13చోట్ల శిబిరాలు నడిచాయి. ధర్నాలు, రాస్తారోకో వంటి ఆందోళనలు చేపట్టారు. మంత్రుల ఇళ్లముట్టడి కార్యక్రమాలకు కూడా వెనుకాడలేదు. ఫలితంగా 60ఏళ్ల రిటైర్‌మెంట్ వయసును ప్రభుత్వం 62ఏళ్లకు పెంచింది. ఉద్యోగ విరమణ సందర్భంగా వర్కర్లకు రూ.1.50లక్షలు, ఆయాలకు రూ.50వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మినీసెంటర్లు మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు వర్కర్లకు ప్రమోషన్ కల్పించేందుకు ప్రభుత్వం దిగివచ్చింది. ముఖ్యంగా గజపతినగరం మండలం రామన్నపేటలోని అంగన్‌వాడీ వర్కర్‌ను రాజకీయ కక్షసాధింపులతో తొలగింపుకు వ్యతిరేకంగా చేసిన పోరాటానికి అధికార యంత్రాంగం దిగిరాక తప్ప లేదు.
- ఆశా వర్కర్లు సిఐటియు అండతో వివిధ సమస్యలపై డిఎం అండ్ హెచ్ఒ, కలెక్టర్ ఆఫీస్ వద్ద 6 గంటల పాటు వంట వార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ క్రమంలో ఆశా కార్యకర్తలు మెటర్నటీ వేతనంతో కూడిన సెలవుతోపాటు అనేక సమస్యలను పరిష్కరించుకున్నారు.
- సమాన పనికి సమాన వేతనం రెగ్యులర్ కోసం సర్వశిక్షాభియాన్ ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద 22 రోజుల పాటు సమ్మెతోపాటు నిరసనలు తెలిపారు. వంట వార్పు కార్యక్రమం, మంత్రి ఇంటికి కలెక్టరేట్ నుండి పెద్ద ఎత్తున ర్యాలీగా తరలివెళ్లారు. వీరికి సిఐటియు వెన్నుదన్నుగా నిలబడింది.
- కొత్తవలస జిందాల్ అక్రమ లాకౌట్ ఎత్తివేయాలని సిఐటియు, వైఎస్ఆర్‌టియు, టిఎంటియుసి జెఎసిగా ఏర్పడి 65 రోజులకు పైగా పోరాటం నడిచింది. యాజమాన్యం దిగివచ్చి పరిశ్రమ తెరచి కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు రూ.1500చొప్పున ఆర్థిక సహాయం ఇచ్చింది.
- నెల్లిమర్ల మిమ్స్ కార్మికులు తొలగింపు, బకాయి డిఎలు, పని ఒత్తిడి తగ్గించాలని 2 నెలలకు పైగా సమ్మె జరిగింది. తొలుత మొండిగా వ్యవహరించిన యాజమాన్యం, ప్రభుత్వ జోక్యంతో దిగరాక తప్పలేదు. ఆ పోరాటంలో ప్రభుత్వం అనేక విచ్ఛిన్నకర, అణిచివేత చర్యలు అవలంభించింది. 23 మందిని 13 రోజుల పాటు సెంట్రల్, సబ్‌జైల్లో పెట్టారు. చివరకు రాష్ట్ర నాయకత్వం సహకారంతో లేబర్ ఆఫీస్‌లో ఒప్పందం కుదిరింది. నూతన వేతన ఒప్పందం చేశారు.
- గరివిడి మండలం దేవాడ మైన్స్ లీజుఒప్పందం పూర్తయిన నేపథ్యంలో స్థానిక కార్మికుల తొలగింపుచర్యలు సిఐటియు పోరాటంతో ఆగాయి.
- రామభద్రపురం, ఎస్.కోట, పురిటిపెంట, గజపతినగరం, ఎల్.కోట, గరివిడి మేజర్ పంచాయతీల్లో జీతాలు పెంచాలని, బకాయి జీతాలు చెల్లించాలని 26 రోజుల వరకు వివిధ పంచాయతీల్లో సమ్మె జరిగింది.



ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

అమెరికా టారిఫ్‌లను వ్యతిరేకించండి

- సుంకాలు తగ్గించకుంటే ప్రజా ఉద్యమం
- వామపక్షాల హెచ్చరిక
- ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద నిరసన

ప్రజాశకి-విజయనగరం టౌన్

అమెరికా టారిఫ్ పెంపునకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా వామపక్ష పార్టీలు ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సిపిఐ ఎం ఎల్ పార్టీ నాయకులు రెడ్డి నారాయణరావు, సిపిఐ ఎం ఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు బెహరా శంకరరావు మాట్లాడారు. భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ఆక్వా, టెక్స్‌టైట్స్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోయాయన్నారు. దేశ సముద్ర ఉత్పత్తుల్లో 40 శాతం ఎగుమతులు ఆంధ్రప్రదేశ్ నుండి అవుతున్నాయన్నారు. రొయ్యల ధరలు ఘోరంగా పడిపోవడంతో సముద్ర తీర ప్రాంతాల్లోని రొయ్యలు, చేపల రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారని అన్నారు. గార్మెంట్స్, టెక్స్‌టైల్స్ రంగాల్లో ఫ్యాక్టరీలు, స్పిన్నింగ్ మిల్లుల్లో పని చేస్తున్న వేలాది మంది కార్మికుల ఉపాధి పోయిందన్నారు. మన దేశీయ ఎగుమతులపై సుంకం పెంచి మరోవైపు అమెరికా నుండి వ్యవసాయ ఉత్పత్తుల్ని పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాలని, రష్యా నుండి ఆయిల్ కొనుగోలు ఆపాలని పెడుతున్న షరతులను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అమెరికా వీసాలకు నిబంధనలు కఠినతరం చేయడం, కాలపరిమితిని తగ్గించడం, జరిమానాలు విధించడం వంటి కారణాలతో ఎన్నో ఆశలతో ఉన్నత విద్యనభ్యసించిన విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇన్ని విధాలుగా ట్రంప్ సర్కారు భారత ప్రయోజనాల్ని, సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తున్నా కేంద్రంలోని మోడీ సర్కారు కిమ్మనకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు టిడిపి కూటమి కూడా ఏమాత్రం ప్రయత్నించకపోవడం సరికాదన్నారు. మన దేశ ప్రయోజనాలు కాపాడేందుకు, సార్వభౌమత్వ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలబడాలని డిమాండ్ చేసారు. లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, నాయకులు పి.రమణమ్మ, బి.రమణ,బి.రాంబాబు, సిపిఐ నాయకులు రంగరాజు, లిబరేషన్ నాయకులు గిరి ప్రసాద్, అప్పలరాజు, సిపిఐ ఎంఎల్ నాయకులు అప్పలరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

3 రైల్వే వంతెనల నిర్మాణానికి సర్వే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో 3 రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణానికి సంబంధించిన సంయుక్త సర్వే శనివారం జరిగింది. నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య, ఇతర అధికారులు, ఈస్ట్ కోస్ట్ డిఆర్ఎం కార్యాలయం నుండి వచ్చిన డిప్యూటీ సిఇ, ఇఇ తదితరులు సంయుక్త సర్వే చేపట్టారు. వేణుగోపాలపురం డైట్ కాలేజ్ వద్ద ఒకటి, గాజులరేగ రాళ్లమాలపల్లి ఎఫ్ సిఐ గోడౌన్ వద్ద ఒకటి, విటి అగ్రహారం మార్కెట్ యార్డు వద్ద ఒకటి మొత్తంగా మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మించేందుకు రైల్వే శాఖ సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన సర్వేను నగరపాలక సంస్థ అధికారులతో చేపట్టి తదుపరి చర్యలకు సమయత్తం కానుంది. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ మూడు చోట్ల అవసరమైన ఏర్పాట్లకై కౌన్సిల్ అనుమతి కోరనున్నామని చెప్పారు. 30 మీటర్ల వెడల్పు, కిలోమీటరు వరకు పొడవున కుడి ఎడమల వైపులుగా సర్వీస్ రోడ్లను నిర్మించనున్నారని చెప్పారు. రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణాలు పూర్తయితే ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. సర్వేలోసిఇ ప్రసాద్, టౌన్ సర్వేయర్ సింహాచలం, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల పరీక్ష కోసం కంట్రోల్ రూమ్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ఎపిపిఎస్‌సి ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్ల పరీక్ష కోసం అభ్యర్థులకు సహాయం అందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని జిల్ల రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ సందేహాల నివృత్తికి ఈ కంట్రోల్ రూమ్ నెంబరు 08922-236947కు సంప్రదించవచ్చునని సూచించారు.

క్రీడాకారులకు బ్యాడ్మింటన్ రాకెట్స్ వితరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఎస్ఎ ఇండోర్ స్టేడియంలో కోచ్ గుంట్రోతు శ్రీనివాసరావు వద్ద శిక్షణ పొందుతున్న బావి భారత క్రీడాకారులు కొలుసు జశ్విత , పి జోషి కృష్ణలకు విజయనగరం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహాధ్యక్షులు, విజయనగరం సిటీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంకెబి శ్రీను రూ.10వేలు విలువ చేసే రెండు యోనెక్స్ రాకెట్లను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు కొండపల్లి అప్పలనాయుడు డాక్టర్ వి ఎస్ ప్రసాద్ చేతులమీదుగా శనివారం అందజేశారు. కార్యక్రమంలో కోచ్ జి. శ్రీనివాసరావు, బి.భాను ప్రకాష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

అన్నదాతకు తప్పని తిప్పలు

పోలీసు పహారాలో యూరియా పంపిణీ



గజపతినగరం పిఎసిఎస్ వద్ద యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

ప్రజాశక్తి-గజపతినగరం/డెంకాడ/నెల్లిమర్ల

జిల్లాలో యూరియా కొరత వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో అరకొరగా వచ్చిన యూరియాను అధికారులు, పోలీసుల పర్యవేక్షణలో డెంకాడ, గజపతినగరం మండల కేంద్రాల్లోని పిఎసిఎస్‌ల వద్ద శనివారం రైతులకు యూరియాను పంపిణీ చేశారు. గత కొద్ది రోజులుగా ఎరువుల కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ నేపథ్యంలో యూరియా పంపిణీ చేస్తారని సమాచారం తెలుసుకున్న రైతులు డెంకాడ పిఎసిఎస్ కార్యాలయం వద్దకు శనివారం అధిక సంఖ్యలో చేరుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీసు బందోబస్తు కోరడంతో మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీత ఆధ్వర్యంలో పోలీసు పహారా మధ్య యూరియాను రైతులకు పంపిణీ చేశారు పిఎసిఎస్ సిఇఒ సిహెచ్ మహేశ్వరరావు, వ్యవసాయ విస్తరణాధి కారి బి.రామకోటి, విఆర్ఒ అపర్ణ, కానిస్టేబుల్ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరంలో యూరియా కోసం తెల్లవారుజాము నుంచే ఆధార్‌కార్డు పట్టుకొని క్యూ లైన్ లో నిలబడే పరిస్థితి ఏర్పడింది. రోజంతా నిల్చున్న ఒక్క బస్తా కూడా దొరక్క పలువురు వెనుదిరిగారు. పురుగు మందులు దుకాణాల యజమానులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే విమర్శలు నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై ప్రైవేట్ దుకాణాల వద్ద ముందుగా టోకెన్లు ఇచ్చి రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నారు. గజపతినగరం రైతు సేవా కేంద్రం 2 వద్ద వ్యవసాయ అధికారులు వారి సిబ్బంది సిప్పులు పంపిణీ చేసి, మెంటాడ రోడ్డు లో ఉన్న సత్య



డెంకాడ: పోలీసుల పర్యవేక్షణలో యూరియా అమ్మకాలు

ట్రేడర్స్ గోడౌన్లో యూరియా ఒక్కో రైతుకు ఒక్కో బస్తా కింద 267 బస్తాలు పంపిణీ చేశారు. కాలం రాజుపేట, పిడిశీల , పాత శీరంగరాజు పురం, కొత్త శ్రీరంగరాజుపురం, డోలపాలెం, సీతారాంపురం గ్రామంలో రైతుసేవా కేంద్రాల వద్ద 267 యూరియా బస్తాలు పంపిణీ చేసినప్పటికీ కొంతమంది రైతులు యూరియా అందక వెనుతిరిగారు. గజపతినగరం పిఎసిఎస్‌లో నిల్వ ఉన్న 267 యూరియా బస్తాలను తెల్లవారుజాము నుంచి వ్యవసాయ అధికారులు పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది సహకారంతో రైతుకు ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు. తెల్లవారి 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎండలో నిరీక్షించినప్పటికీ యూరియా కొరత కారణంగా చాలామంది రైతులకు యూరియా దొరక్క నిరాశతో వెనుదిరిగారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారి కిరణ్ కుమార్ స్పందిస్తూ శనివారం ఒక్కరోజే 36 టన్నులు యూరియాను రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. త్వరలో రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేసే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

అసలే యూరియా కొరత.. ఆపై అదనపు ధర

నెల్లిమర్ల మండలంలోని సతివాడ సత్య నారాయణ ట్రేడర్స్, నెల్లిమర్ల మన గ్రోమోర్ షాపుల్లో అధికారులు, పోలీసులు, రెవిన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో యూరియా అమ్మకాలు జరిగాయి. సతివాడ సత్యనారాయణ ట్రేడర్స్ మాత్రం ఒక్కొక్క బస్తా మీద 30 నుంచి 40రూపాయలు అదనపు ధరకు అమ్మడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ షాపునకు 267యూరియా బస్తాలు రాగా, సుమారు 500 మంది వరకు రైతులు చేరుకున్నారు. అధిక ధరకు అమ్ముతున్నట్లు అధికారులకు చెప్పినా ఎవరూ స్పందించలేదు. నెల్లిమర్ల మన గ్రోమోర్ సెంటర్‌కు 267 బస్తాలు రాగా అధిక సంఖ్యలో చేరుకోవడంతో అధికారులు, పోలీసులు దగ్గరుండి యూరియా పంపిణీ చేపట్టారు.



అన్నదాత పోరు పోస్టర ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

రైతులను కించపర్చడం అచ్చెన్నకు తగదు

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

9న జరిగే అన్నదాతపోరు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రైతులను కించపరుస్తూ మాట్లాడడం వ్యవసాయశాఖా మంత్రి అచ్చెన్నాయుడుకు తగదని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మాజీ డిప్యూటీ స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో విజయనగరం రెవెన్యూ పరిధిలో నాలుగు నియోజకవర్గాల వైసిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 9న తలపెట్టిన అన్నదాతపోరు కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తూ, ఇబ్బందులు పడుతుంటేమంత్రి అచ్చెన్నాయుడు రైతులను కించపరిచేలా మాట్లాడడం తగదన్నారు. క్యూలో నిలబడిన రైతులను ఉద్దేశించి 'బఫే భోజనానికి వెళ్లేటప్పుడు నిలబడలేదా..? ఎందుకు నిలబడరు?' అంటూ రైతులను హేళన చేయడం భావ్యం కాదన్నారు. రైతు కుటుంబంలో పుట్టి , రైతులను కించపరచడం సమంజసం కాదన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా పుష్కలంగా ఎరువులను , విత్తనాలను అందించామన్నారు. టిడిపికి ఓటువేసినందుకు యూరియా కోసం రైతులు క్యూలో నిలబడాలా అని ప్రశ్నించారు. మరొకవైపు మద్దతు ధరలు లేక రైతులు సైతం రోడ్డెక్కి రోదిస్తున్న పరిస్థితులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. తొలి ఏడాది అన్నదాత సుఖీభవ పథకాన్ని పూర్తిగా ఎగ్గొట్టారని, రెండో ఏడాదికి సంబంధించి అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు, మాజీ ఎంపీ బెల్లాన.చంద్రశేఖర్ , ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, మండల పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జెఎన్‌టియుజివి విసికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



జెఎన్‌టియుజివి ఇన్‌ఛార్జి వైస్ - ఛాన్సలర్ ప్రొఫెసర్. డి.రాజ్యలక్ష్మికి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రతిష్టాత్మకమైన లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. ఈ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని, మరింత ఉత్సాహంగా పని చేయుటకు ఇటువంటి అవార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని ఆమె అన్నారు. ఈ సందర్భంగా ఆమెకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్. జి. జయసుమ, డైరెక్టర్‌లు, కాలేజీ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్, వైస్ - ప్రిన్సిపాల్ వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

రజక మహిళ హత్యపై కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం కొత్తవలసలో ఈనెల 4న దవళ రజక మహిళ అరసవిల్లి హరమ్మను హత్య చేసిన నిందితులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్ వద్ద రజక సంఘం ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రజక సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ రజక సేవా సంఘం నాయకులు గురజాపు సత్యారావు, కెల్ల సత్యం, మద్ది పైడ్రాజు, తామడ అచ్చన్న తదితరులు మాట్లాడారు. రజకులపై గ్రామ బహిష్కరణలు, భౌతిక దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం రజకుల రక్షణ కోసం సమగ్రమైన భద్రతా చట్టాన్ని రూపొందించాలని డిమాండ్‌చేశారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం డిఆర్‌ఒకు వినతి అందజేశారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

క్షేత్రస్థాయిలో మెరుగైన వెద్యసేవలను అందించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని వైద్యారోగ్య, పశు సంవర్ధకశాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో కలెక్టరేట్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. పిహెచ్‌సి, సిహెచ్‌సిల ద్వారా అందిస్తున్న వైద్యం, గ్రామాల్లో ఎఎన్ఎంలు, ఆశా వర్కర్ల ద్వారా అందిస్తున్న సేవలపై ఈ సందర్భంగా సమీక్షించారు. పశు సంవర్ధక శాఖ ద్వారా గ్రామీణ ప్రజలకు అందుతున్న వైద్యసేవలను ఆరా తీశారు. సిబ్బంది, మందులు, ఇతర సదుపాయాలను తెలుసుకున్నారు. సిబ్బంది అంకితభావంతో పనిచేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి, పశు సంవర్ధకశాఖ జెడి డాక్టర్ దామోదరరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంకలాం లే అవుట్ పరిశీలన

ప్రజాశక్తి - కంటోన్మెంట్

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ స్పెషలాఫీసర్, అడ్మినిస్ట్రేషన్, విజిలెన్సు విభాగం జనరల్ మేనేజర్ పి. వెంకటరమణ అంబటివలస, గుంకలాం లేఅవుట్‌లను పరిశీలించారు. అనంతరం హౌసింగ్ కార్యాలయములో ఇఇలు, డిఇలు, ఎఇలు, మండల ఇన్‌ఛార్జీలతో సమావేశం నిర్వహించారు. 3లక్షల గృహాలను పూర్తి చేసేందుకు జిల్లాకు ప్రభుత్వం నిర్దేశించిన 11,648 ఇళ్ల లక్ష్యంలో నేటి వరకు 5,988 గృహాలు పూర్తి చేశారని, మిగిలిన 5,660 ఇళ్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

కొబ్బరి దినోత్సవం.. ఓ కాలక్షేప కార్యక్రమం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రతి పండగ వెనుకా ఒక చారిత్రక నేపథ్యం, సంస్కృతి సంప్రదాయాలు, ఇంకా చెప్పుకుంటూ పోతే... చెడుపై మంచి సాధించిన విజయగాథలు, పంట చేతికి అందే సమయాలు ఉంటాయి. అచ్చు అలాగే ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే దినోత్సవాల వెనుక కూడా ఓ మంచి ఉద్దేశాలు కూడా ఉంటాయి. కానీ, అటువంటి మంచి సంకల్పం కేవలం ఆ ఒక్కరోజుకే పరిమితమైతే ఎలా ఉంటుంది? ఇదిగో ఇలా చింతపల్లిలో జరిగిన ప్రపంచ కొబ్బరి దినోత్సవం మాదిరిగానే ఉంటుంది. ఈనెల 2వ తేదీన చింతపల్లి కొబ్బరి పీచు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ కొబ్బరి దినోత్సవంలో అధికారులు, ఆ ఉత్సవానికి వచ్చిన అతిథులు కొబ్బరివల్ల జరిగే మేలు, ఉపాధి, ప్రజారోగ్యం కోసం ఊదర గొట్టారు. వారు చెబుతున్నట్టే కొబ్బరి పంటతోపాటు అనుబంధ పరిశ్రమలను అభివృద్ధి చేస్తే గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. కొబ్బరి పీచు, కొబ్బరి నూనె, హ్యాండ్‌క్రాఫ్ట్ ఉత్పత్తుల ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చు. దీనికితోడు కొబ్బరి పంటలో అంతర పంటలకు, ఆధునిక సాగు విధానాలకు అవకాశం ఉంటుంది. కానీ, అందుకు తగ్గట్టుగా కొబ్బరిసాగును ప్రోత్సహిస్తున్నారా? అని జనం చర్చించుకుంటున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. జిల్లాలో కొబ్బరిసాగుకు విస్తారంగా అవకాశాలు ఉన్నాయి. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని కొబ్బరికి మంచి డిమాండ్ కూడా ఉంది. ఎయిర్‌పోర్టు అభివృద్ధి పేరిట ఇప్పటికే భోగాపురం మండలంలో వందలాది ఎకరాల కొబ్బరితోటలను నరికేశారు. ఇటువంటి పరిస్థితుల్లో



కొబ్బరి సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ఇందుకు తగ్గ ప్రోత్సాహం ప్రభుత్వం నుంచి లేదు. పండిన పంటకు మార్కెట్ సదుపాయం, గిట్టుబాటు కల్పించడం, ఇతర రాయితీలు కల్పించడం వంటివి కూడా లేవు. మరోవైపు పూసపాటిరేగ మండల కందివలస గెడ్డకు ఆనుకుని ఆరబిందో, రెడ్డీస్, శేషసాయి, గ్రీన్ టెక్ కెమికల్ లేబొరెటరీస్ తదితర కంపెనీలు కాలుష్య నివారణ చర్యలను గాలికి, వ్యర్థాలను యథేచ్ఛగా గెడ్డలోకి వదిలేయడంతో స్థానికంగా ఉన్న కొబ్బరితోటలు ఎదుగుదలపైనా, దిగుబడిపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా గెడ్డలోని గుంతల్లో చేరిన కాలుషిత నీరు భూగర్భ జల్లాల్లోకి వెళ్తోంది. గడిచిన మూడు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి ఉండడంతో ప్రస్తుతం భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. ముఖ్యంగా కంపెనీ వెదజల్లుతున్న దూళిదుమ్ము వల్ల ఈ ప్రాంతంలో విస్తారంగావున్న కొబ్బరి తోటలు మసిబారుతున్నాయి. గత పదేళ్ల క్రితంతో పోలిస్తే కొబ్బరి బొండాల దిగుబడి కూడా సగానికి పడిపోయిందని రైతులు వాపోతున్నారు. ఇటువంటి సమస్యలు కేవలం పూసపాటిరేగ మండలం అల్లాడపాలెంలో మాత్రమే కాదు. దానికి ఇరుగుపొరుగున ఉన్నా కొణతలపాలెం, చోడమ్మ అగ్రహరం గ్రామాల్లోనూ ఇటువంటి దుస్థితే ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో కాలుష్య కారకపరిశ్రమలపై చర్యలు తీసుకోవడం, కనీసం కొబ్బరి తోటలకు ఇబ్బంది లేకుండా చూడడం వంటివి చేయకుండా ఇలాంటి కొబ్బరి ప్రపంచ దినోత్సవాలు నిర్వహించుకోవడం వల్ల ఒరిగిన ప్రయోజనం ఏమిటని జనం ప్రశ్నిస్తున్నారు. కొబ్బరి దినోత్సవం ఓ కాలక్షేప కార్యక్రమమేనంటూ పబ్లిక్ టాక్ వినిపిస్తోంది.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

శృంగవరపుకోట: గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే అంశంపై పిల్లలకు స్థానిక సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఎస్‌కోట జూనియర్ సివిల్ జడ్జ్ బి.కనక లక్ష్మి అధ్యక్షతన శనివారం న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలో తరచూ బాలికలపై లైంగిక పరమైన కేసులు అధికమవుతున్నాయన్నారు. బాలికలకు అవగాహన లోపం కారణంగా వారిని ఇతర వ్యక్తులు ఏ దృష్టితో టచ్ చేస్తున్నారో? ఎలా గమనించాలి? అనే అంశాలపై గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వాటి మధ్య తేడాలను వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రత్నజ్యూస్, సీనియర్ న్యాయవాది అల్లు సత్యాజి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తు

నెల్లిమర్ల: సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి లెక్చరర్ పోస్టుకి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ కోరారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కళాశాలలో కామర్స్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకి అర్హులైన వారు ఈ నెల 9లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ పోస్టుకి ఎమ్‌కామ్‌లో 50 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని దరఖాస్తు 9వతేదీన సాయంత్రం 5 గంటల లోగ అందించాలని కోరారు. ఇంటర్వ్యూ 11న జరుగుతాయని ఇతర వివరాలకు 9490107015 సంప్రదించాలని కోరారు.

ఆయా, ఎండిఎం కార్మికులతో సమావేశం

వేపాడ: స్థానిక విద్యా వనరుల కేంద్రంలో శనివారం మండల విద్యాశాఖాధికారులు ఎన్.నాగభూషణరావు, పి.బాల భాస్కరరావు మండల లోని ఆయాలకు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయాలు ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు పాఠశాలకు హాజరై పాఠశాల పరిసరాలు, తరగతి గదులు పరిశుభ్రం చేయాలని, రోజుకు నాలుగు సార్లు టాయిలెట్స్, క్లీనింగ్ టూల్స్, కెమికల్స్‌ను ఉపయోగించి శుభ్రం చేయాలని, కిచెన్ గార్డెన్ అభివృద్ధి చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన కార్మికులు ప్రతి రోజూ పాఠశాలకు హాజరైన వెంటనే వంటగది పరిసరాలు శుభ్రం చేసి వంట పాత్రలను వేడి నీటితో శుభ్రం చేసి వంటలు ప్రారంభించాలన్నారు. కూరగాయలు, ఆకుకూరలు కోసేటప్పుడు జాగ్రత్త పాటించాలని, కిచెన్ గార్డెన్‌లో పండిన వాటిని ఎండిఎంలో వినియోగించాలని సూచించారు.

నేడు రామస్వామి దేవస్థానం మూసివేత

నెల్లిమర్ల: ఈ నెల 7న రామతీర్థం రామస్వామి దేవస్థానం గ్రహణం కారణంగా మూసివేయనున్నట్లు సహాయ కమిషనర్ వై.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి 9.50 గంటలకు సంపూర్ణ చంద్రగ్రహణం కావడంతో మధ్యాహ్నం 3.30 గంటలకు శ్రీ రామస్వామి దేవాలయాను మూసివేస్తామన్నారు. మరుసటిరోజు సోమవారం సంప్రోక్షణ అనంతరం బాలభోగం నివేదన తరువాత 11.30గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తామన్నారు.

పారిశుధ్య నిర్వహణ బాధ్యత కార్యదర్శులదే

సంతకవిటి: గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని చీపురుపల్లి డివిజన్ డెవలప్మెంట్ అధికారి కె.హేమసుందర్ అన్నారు. శనివారం మండలంలోని మిర్తివలస, మందరాడ, తాలాడ, గుళ్ళ సీతారాంపురం, తలతంపర, బిల్లాని, బొద్దూరు గ్రామ సచివాలయాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో ఎస్‌ఆర్‌ఎస్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి వహించాలన్నారు. మన మిత్ర వాట్సాప్ గవర్నమెంట్ యాప్ సేవలు గూర్చి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సచివాలయాల్లోని పలు రికార్డులను, గ్రామాల్లోని పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.సురేష్‌కుమార్, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానం.. మహాదానం

చీపురుపల్లి: నేత్రదానం మహాదానం అని పట్టణానికి చెందిన మానవీతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బివి గోవిందరాజులు అన్నారు. శనివారం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి నేత్రదానం, రక్తదానం, అవయవదానం వల్ల అవగాహన కల్పించారు. నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా నేత్రదానంపై అవగాహన పత్రాలను పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ మెంబర్, రెవెన్యూ డివిజన్ కోఆర్డినేటర్ బివి గోవిందరాజులు, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సుధీర్, డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ తాజ్ కుమార్, కళ్ళ డాక్టర్, రెడ్ క్రాస్ టెక్నీషియన్ రమణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి సిఎంఆర్ఎఫ్ : ఎమ్మెల్యే

లక్కవరపుకోట: అర్హులైన నిరుపేదలకు సిఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో 16 మంది లబ్ధిదారులకు రూ.12.93లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేక అనారోగ్య కారణాలు బాధపడుతున్న వారికి ఈ సహాయం ఎంతో దోహదపడుతుందన్నారు. పార్టీలకతీతంగా కేవలం అర్హత ఆధారంగా ముఖ్యమంత్రి సహాయనిధి అందిస్తున్నామన్నారు.

జిందాల్ నిర్వాసితుడు మృతికి నివాళి

శృంగవరపుకోట: జిందాల్ నిర్వాసితుడు వన్నెపురి పొట్టిదొర ఇటీవల మరణించడంతో ఆయన చిత్రపటానికి శనివారం బొడ్డవరలో ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్‌తో పాటు నిర్వాసితులందరూ పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా చల్లా జగన్ మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా భూములు కోల్పోయిన నిర్వాసితులు సుమారు 200 మంది రైతులు మరణించారని వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, జిందాల్ యాజమాన్యంపై ఉందని గుర్తు చేశారు. నమ్మించి మోసం చేయడంతో చాలా మంది నిర్వాసితులు తీవ్ర నిరాశతో చనిపోతున్నారు. ఈ సందర్భంగా వన్నెపురి పొట్టిదొర ఆత్మకి శాంతి చేకూరాలని మౌనం పాటిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణానికి పాత్రికేయులే మూలస్తంభం

చీపురుపల్లి: ప్రస్తుత సమాజంలో మంచి సమాజ నిర్మాణానికి పాత్రికేయులే మూల స్తంభాలుగా నిలబడుతున్నారని వాసవి క్లబ్ వనిత ఉమెన్ ఎంపైర్ అధ్యక్షురాలు వజ్రపు సంతోషి అన్నారు. పాత్రికేయుల దినోత్సవం సందర్భంగా వాసవి క్లబ్ వనిత ఉమెన్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని సీనియర్ పాత్రికేయులు బలగ రామారావు, మధులను స్థానిక ప్రెస్ క్లబ్‌లో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవి క్లబ్ వనిత ఉమెన్స్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలు, చేయూత కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పాత్రికేయుల దినోత్సవ సందర్భంగా చిన్న గౌరవాన్ని అందిస్తున్నామని ఈ సందర్భంగా వారు వివరించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నెల్లిమర్ల: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా టీచర్ ఎం సంతోషి భారతి చెప్పారు. నెల్లిమర్ల పట్టణంలోని శ్రీఉత్కృష్ట విద్యాలయంలో శనివారం యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యాంత్రిక కాలంలో జీవన ప్రమాణం తగ్గిపోతుందని చెప్పారు. యువత హార్ట్‌ఎటాక్‌తో చనిపోతున్నారని, చిన్న వయస్సులోనే రోగాలు వస్తున్నాయని చెప్పారు. యోగా చేస్తే రోగాలు దరి చేరవని, జీవన ప్రమాణం పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వి. అమృత, కరస్పాండెంట్ సూరిబాబు పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి

డెంకాడ: భోగాపురం మండలంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని బ్యాంక్ మేనేజర్ బి.జయచంద్ర కోరారు. స్టేట్ బ్యాంకు 120వ వ్యవస్థాపకదినోత్సవం సందర్భంగా భోగాపురం బ్రాంచ్‌లో శనివారం ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1906వ సంవత్సరం నుంచి బ్యాంకు సేవలను మొదలుపెట్టి 120 సంవత్సరాలుగా విజయవంతంగా నడుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది ఖాతాదారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ప్రసాదరావు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు చేసే వివాహాలు చెల్లవని ఇవి బాల్య వివాహల కిందకే వస్తాయని చెప్పారు. ఆడ పిల్లలను లైంగికంగా వేధిస్తే పోక్సో చట్టం కింద చట్టాలు మోపి జైలుకు పంపుతామన్నారు. బాల్య వివాహాల నిరోధక కమిటీలు బలోపేతం చేయాలన్నారు. తహశీల్దార్ ఆంజనేయులు, ఉప తహశీల్దార్ గిరిధర్, వన్ స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ అనిత, డిసిపియు సోషల్ వర్కర్ సరస్వతి, బెజ్జిపురం ఎన్‌జిఒ ప్రతినిధి హరీష్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వాగ్వివాదాల మధ్య మండల సమావేశం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

జామి మండల పరిషత్ సమావేశ భవనంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాగ్వివాదాల నడుమ రసా బసగా సాగింది. సభ ప్రారంభం కాగానే మండలంలోని చింతాడ గ్రామ సర్పంచ్ అప్పాన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్ షాపుల్లో మద్యం కొనుక్కుంటున్నట్లు ప్రభుత్వ వైఫల్యం వల్ల రైతులు బ్లాక్ మార్కెట్లో యూరియాను కొనుక్కోవాల్సి వస్తుందని అన్నారు. యూరియాను సకాలంలో రైతులకు అందించడంలో ప్రభుత్వంతో పాటు అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ప్రశ్నించారు. ఈ విషయమై గజపతినగరం మార్కెటింగ్ చైర్మన్ పి.బి గోపాలరాజు మాట్లాడుతూ ప్రస్తుతం యూరియా కొరత ఉన్న మాట వాస్తవమేనని వ్యవసాయ శాఖ మంత్రితో మాట్లాడి రెండు, మూడు రోజుల్లో యూరియా సమస్య లేకుండా చూస్తామన్నారు. ఎక్సైజ్ అధికారులు మద్యం బెల్టు దుకాణాలపై చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణపై ఎస్.కోట ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ బెల్టు దుకాణాలలో మద్యం అమ్మేవారు తెలివిగా మద్యం సీసాపై ఉన్న స్టిక్కర్ తీసి అమ్ముతున్నారని అన్నారు. జెడ్‌పిటిసి గొర్లె సరయు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఎటువంటి తప్పులూ చూపించకుండా నోటీసులు ఇవ్వకుండా తొలగిస్తున్నారని, వైసిపి సర్పంచులకు ఎంపిటిసిలకు



ఎస్‌కోట: అధికారులను నిలదీస్తున్న చింతాడ సర్పంచ్ సుబ్రమణ్యం

అధికారులు విలువనీయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో బాయిలర్ కోళ్లు చనిపోతున్నాయని, వాటిని చికన్ దుకాణదారులు కొనుగోలుదారులకు అమ్ముతున్నారని వీటి వల్ల ప్రజలకు రోగాలు వస్తున్నాయని గోడుకొమ్ము సర్పంచ్ పిల్లల భవాని ఆరోపించగా ఈ విషయమే మండల పశువైద్యాధికారిని గీతారాణి మాట్లాడుతూ మండలంలోని ఆర్‌బిపురం, కిర్ల గ్రామాలలో గల పౌల్ట్రీ ఫారాలలో కోళ్లు చనిపోతున్నాయని కొద్ది రోజులు చికెన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ అప్పలనాయుడు, డిప్యూటీ తహశీల్దార్ మూర్తి, ఎంపిపి ఎస్. అరుణ, వైస్ ఎంపిపిలు గేదెల వెంకట్రావు, పి.విజయలక్ష్మి, సర్పంచులు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం ఆందోళన చెందొద్దు

బొబ్బిలిరూరల్: ఎరువులు కోసం రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని ఎఒ యం.శ్యాంసుందర్ అన్నారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వైస్ ఎంపిపి ఏ.శంకర్రరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ ముందుగా ప్రారంభం కావడం, మొక్కజొన్న ఈఏడాది ఎక్కువగా వెయ్యడం వల్ల ఎరువులు సకాలంలో అందడంతో జాప్యం జరిగిందన్నారు. మరో వారం రోజుల్లో చాలినంత ఎరువులు సరఫరా జరుగుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సులు వేయడం వల్ల రద్దీ పెరిగి పురుషులు, అత్యవసర ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అదనపు బస్సులు వేయాలని చింతాడ పిఎసిఎస్ అధ్యక్షులు కె.అప్పలనాయిడు సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వానికి తెలియజేస్తామని ఎంపిడిఒ రవికుమార్ తెలిపారు. ఈ సమావేశంలో డిటి గౌరీ శంకర్రావు, జెడ్‌పిటిసి శాంత కుమారి, సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి

ప్రజాశక్తి- బొండపల్లి

ఉపాధ్యాయులు విద్యతోపాటు నైతిక విలువలు పెంపొందించాలని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. మండలంలో శుక్రవారం రాత్రి బోడసింగిపేటలో గల బెల్లాన కన్వెన్షన్ హాల్‌లో చైతన్య భారతి ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యా యులకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాలక్రమంలో మారుతున్న రోజులకు అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలన్నారు. సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ ఎ. రామారావు మాట్లాడుతూ ఒత్తిడి, ఆందోళన లేని ఆహ్లాదకరమైన విద్యను బోధించాలన్నారు. చైతన్యభారతి అధ్యక్షులు బుద్ధరాజు వెంకట శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన సమావేశం లో ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మెల్సీ సత్కరించారు. కార్యక్రమంలో బి.ఎస్.ఆర్ హాస్పటిల్ చైర్మన్ బెల్లాన లయన్ లక్ష్మీనరేన్, జిల్లా ఉపవిద్యాశాఖదికారి మోహనరావు, ఆర్‌వి సుబ్రహ్మణ్యం, చైతన్యభారతి పూర్వఅధ్యక్షులు జి.లక్ష్మణరావు, జి.అప్పలనాయుడు, చైతన్యభారతి గౌరవ అధ్యక్షులు డాక్టర్ వి.కృష్ణారావు, ఎం.



బొండపల్లి: పురిటిపెంటకు చెందిన ఉపాధ్యాయులు గొర్లె ఆదినారాయణ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ, సర్వశిక్ష ఎపిసి తదితరులు

పద్మావతి, జాతీయ అవార్డు గ్రహీత బొంతలకోటి శంకర రావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను, లక్ష్య ఫౌండేషన్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన యుటిఎఫ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీతులు బి.అరుణకళ, వివి. రోహిణి, ఎ.శ్రీనివాసరావు, పి.వరప్రసాద్, పి.సరస్వతి, యుటిఎఫ్ మండల నాయకులు ఆర్.రామసత్యం, ఆర్. చల్లం నాయుడు, పి.చిరంజీవి, డి.ప్రసాద్, ఎం. తాతంనాయుడు, ఎం.సతీష్, కె.సురేష్, జి.అవతారం, ఎన్.రామారావు, బి.వెంకట్రావు పాల్గొన్నారు.

గరివిడి: ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా అవార్డు అందుకున్న తాటిగూడ గ్రామ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాడ్డి రామకృష్ణను ఎంఇఒ పి.రామారావు, డి. అప్పన్న ఆధ్వర్యంలోసిబ్బంది సన్మానించారు. గరివిడి క్లస్టర్ హెచ్‌ఎం ఎం.నిర్మల, తాటిగూడ మాజీ హెచ్‌ఎం, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎ.సత్యశ్రీనివాసు, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎం.రవికుమార్, బి.రాము, పి.లక్ష్మణరావు, నారాయణ రావు, పాఠశాల సిబ్బంది ఎల్.రామకృష్ణారావు, రవిశంకర్, ఎల్.వి.జగన్నాథరావు, గోపినాథ్, కూర్మినాయుడు ఆయన సేవలను కొనియాడారు.

తెర్లాం: స్థానిక మండలం పరిషత్ సమావేశ మందిరంలో యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు శంకర్రావు, ఎంఇఒ 2 పాపారావు, యుటిఎఫ్ అధ్యక్షులు జి మునిస్వామి, కార్యదర్శి జి.శంకర్రావు, వైస్ ఎంపిపి సిహెచ్ సత్యనారాయణ, పిఎసిఎస్ చైర్మన్ ఎన్ వెంకటేశ్వరరావు, గర్భాపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

గుర్ల: విద్యా భోదనలో అంకితభావంతో పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు పొందడం ఎంతో అభినందనీయమని గూడెం పిఎసిఎస్ చైర్మన్ పిల్లా అప్పలనాయుడు అన్నారు. శనివారం చింతలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన ఎం. రామకృష్ణ, హైస్కూల్ హెచ్ఎం.గౌరి దేవి, పీడీ రామకృష్ణలను ఘనంగా సత్కరించారు. పల్లిగండ్రేడు ప్రాథమిక పాఠశాలలో విశ్రాంతి ఉపాధ్యాయులు అడపా అప్పల సత్యనారాయణని దుశ్శాలువతో కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండల విద్యా శాఖ అధికారి ఎస్ భానుప్రకాశ్ మాట్లడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకరయ్య, గ్రామ పెద్దలు మజ్జి రామారావు, రెల్లి అప్పారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమెరికా టారిఫ్‌లను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అమెరికా అధ్యక్షులు ట్రంప్ విధిస్తున్న టారీఫ్‌లను వ్యతిరేకించాలని సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన స్థానిక విద్యుత్ జిల్లా స్టోర్స్ వద్ద హమాలీలకు దేశం పై ట్రంప్ విధిస్తున్న టారీఫ్‌ల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా అధ్యక్షులు ట్రంప్ మన దేశంపై అధిక శాతం టారీఫ్‌లు విధించడం దుర్మార్గమన్నారు. ముఖ్యంగా ఎగుమతులపై అధికంగా టారిఫ్‌లు విధించి ఆర్థికంగా, ఉపాధి లేకుండా చేయడం ట్రంప్ ముఖ్య లక్ష్యమన్నారు. దీనివల్ల సుంకాలు పెరిగి రొయ్యలు, చేపల వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. కుటీర పరిశ్రమలు దెబ్బతిని ఉపాధి లేకుండా పోతుందని తెలిపారు. అమెరికా ఇంత దారుణానికి ఒడిగడుతున్నా బిజెపి, కూటమి ప్రభుత్వం వ్యతిరేకించకపోవడం దారుణమన్నారు. దేశ ఉత్పత్తులకు రక్షణ కల్పించి అమెరికా విధిస్తున్న సుంకాలను అన్ని వర్గాలూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు పతివాడ లక్ష్మణరావు, కెల్ల గోవిందరావు, పతివాడ పెద రాంబాబు, చిన రాంబాబు, మీసాల లెనిన్, కలిశెట్టి శ్రీను, పతివాడ నారాయణ, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రూ.10.30 కోట్లతో 44 పనులు మంజూరు

రామభద్రపురం: మండలంలో 22 పంచాయతీల్లో రూ.10.62కోట్లతో వివిధ అభివృద్ధి పనులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఎఇ రమేష్ తెలిపారు. మండల ఇంజనీరింగ్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీల్లో డబ్ల్యుబిఎం రోడ్లు, మెటల్ రోడ్లు, బీటీ రోడ్లుతోపాటు సిసి రోడ్లు, సీసీ డ్రెయిన్స్ మంజూరయ్యాయని తెలిపారు. ఆరికతోట, ఇట్లామామిడిపల్లి, బూసాయవలస, మామిడివలస, కోటశిర్లాం, జన్నివలస, కొండకెంగువ, రామభద్రపురం, మిర్తివలస, రావివలస గ్రామాల్లో ఈ పనులు త్వరలో మొదలుపెడతామన్నారు. ఈ సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్ హర్ష పాల్గొన్నారు.

తక్కువ వడ్డీకే రుణాలు : ఎజిఎం

మెంటాడ: తక్కువ వడ్డీతో రుణాలు అందించడమే సెంట్రల్ బ్యాంకు లక్ష్యమని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఎజిఎం అరసాడ శ్రీనివాసనాయుడు అన్నారు. మండలంలోని చల్లపేట బ్రాంచి ఆఫీస్ సిబ్బందితో మెంటాడ వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో విశ్రాంత ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార బ్యాంకులు రైతులకు మాత్రమే రుణాలు అందిస్తుందని చాలామంది అపోహ పడుతున్నారని, చల్లపేట సెంట్రల్ బ్యాంక్ బ్రాంచిలో ఖాతాదారులకు అనేక రకమైన రుణాలు తక్కువ వడ్డీకే ఇస్తున్నామని చెప్పారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పింఛన్ యోజన, చెక్ బుక్ సదుపాయం, రూపే డెబిట్ కార్డ్ (పరిమితి లేని లావాదేవీలు ఉచితంగా), ఆన్‌లైన్ ఫండ్ ట్రాన్స్ ఫర్ సదుపాయాలతో పాటు వ్యక్తిగత లోన్లు, ట్రాక్టర్ లోన్లు, మైనర్ ఇరిగేషన్(బోర్లు), కోళ్ల ఫారం, మేకలు గొర్రెలు రుణాలు, పొదుపు సంఘాలకు రుణాలు, సహకార విద్యారుణం, గృహ తనఖా రుణం, గృహ నిర్మాణం కోసం రుణాలు, చిరు వ్యాపారాలకు రుణాలు నాబార్డ్ నిబంధనలు అనుసరించి సబ్సిడీ కూడా అందిస్తున్నామన్నారు. ఖాతాదారులు పెద్ద సంఖ్యలో చేర్పించాలని, డిపాజిట్లు అధిక మొత్తంలో సేకరించాలని సిబ్బందికి సూచించారు. ఉపాధ్యాయుల ద్వారా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్‌పర్సన్ గొర్లె ముసలినాయుడు, చల్లపేట బ్రాంచి మేనేజర్ పాండ్రంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

గిరిజనులు సాగు చేస్తున్న భూములకు సాగు పట్టాలివ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. సాగు పట్టాలివ్వాలని కోరుతూ శనివారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెంటాడ మండలం ఆగూరు రెవెన్యూలోని సర్వే నెంబర్ 239, 240, 241లో సుమారు 57 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్ భూములను అదే మండలం గుడ్డివలస, క్రిందగూడెం, పనుకువానిపేట, గజపతినగరం మండలం సిగడంవలస, రాయవలస, ఎర్రాడవలస గ్రామాలలో నివసిస్తున్న 80 గిరిజన కుటుంబాలు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాయని చెప్పారు. ఆయా భూములకు జామి మండలానికి చెందిన బండారు సంజీవరావు నకిలీ పత్రాలతో భూములను స్వాహా చేసేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. అటవీ భూములుగా రెవెన్యూ అధికారులు గుర్తించినప్పటికి నకిలీ రికార్డులను రద్దు చేయడం లేదన్నారు. అటవీశాఖ అధికారులు గిరిజనులను భయపెట్టి సంజీవరావుకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. నకిలీ రికార్డులను రద్దు చేసి సంజీవరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు సాగు పట్టాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్‌పి

కంటోన్మెంట్: రహదారి భద్రత, ప్రమాదాల నియంత్రణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలోని బ్లాక్ స్పాట్స్ వద్ద విస్తతంగా తనిఖీలు చేపట్టి నిబంధనలు అతిక్రమించిన ద్విచక్ర వాహనదారులపై 955 కేసులు నమోదు చేసి రూ. 4,77,460 నగదును ఈ-చలానాగా విధించినట్లు ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. ప్రమాదకరంగా ద్విచక్ర వాహనాలు నడిపిన వారిపై 88 కేసులు, హెల్మెట్స్ ధరించని ద్విచక్ర వాహన దారులపై 155 కేసులు, మైనరు డ్రైవింగు చేస్తున్న వారిపై 8 కేసులు, డ్రైవింగు లైసెన్సు లేని ద్విచక్ర వాహనదారులపై 471 కేసులు, ద్విచక్ర వాహనాల డ్రైవర్లు, పిలియన్ రైడర్స్ భద్రత నియమాలు ఉల్లంఘించిన వారిపై 46 కేసులు, నంబరు ప్లేట్స్ సక్రమంగా లేని వాహనదారులపై187 కేసులు నమోదు చేసామన్నారు. వాహనదారుడుతోపాటు ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను డిఎస్‌పిలు ఎం.శ్రీనివాసరావు, జి.భవ్యరెడ్డి, ఎస్.రాఘవులు పర్యవేక్షించారన్నారు.

యూరియా సరఫరాలో విఫలం

ప్రజాశక్తి-బొబ్బిలి

రైతులకు యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం నియోజ కవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రైతులకు యూరియా అందించ కపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారన్నారు. అర్హత ఉన్న రైతులందరికీ అన్నదాత సుఖీభవ ఇవ్వలేదని ఆరోపిం చారు. రైతులకు గ్రామాల వద్దే సేవలు అందించేందుకు వైసిపి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తే కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. రైతాంగ సమస్య లపైన, యూరియా ఇవ్వాలని కోరుతూ ఈ నెల 9న బొబ్బిలిలో ర్యాలీ చేసి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపా లన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, జెడ్‌పిటిసిలు సరస్వతి, శాంతి, తూముల భాస్కరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ సావుమురళి, పాల్గొన్నారు.

రామకృష్ణకు ఎమ్మెల్యే అభినందన

విజయనగరంకోట: జంషెడ్‌పూర్‌లో జరిగిన స్టేట్ నేషనల్ సీనియర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణపతకం సాధించిన ఎస్.రామకృష్ణను ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి అభినందించారు. రామకృష్ణ పవర్ లిఫ్టింగ్ 510 కిలోల విభాగంలో 4వ స్థానం సాధించగా, బెంచ్ ప్రెస్ 140 కిలోల విభాగంలో స్వర్ణ పతకం దక్కించుకున్నారు. ప్రస్తుతం ఆయన కోడి రామ్మూర్తి వ్యాయామశాలలో సాధన చేస్తున్నారు.

కొత్తవలసలో ఎంసి సమావేశం

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో అధ్యక్షులు చొక్కాకుల మల్లు నాయుడు అధ్యక్షతన శనివారం వ్యవసాయ మార్కెట్ సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న అంశాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ జూలై నుంచి ఆగస్టు నెల ఆదాయం, ఖర్చులు గురించి చర్చించారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సమక్షంలో పలు అంశాలపై చర్చించారు. మార్కెట్ కమిటీ కార్యాలయం శిథిలావస్థలో ఉన్నందున, ప్రస్తుతం అద్దె భవనంలో నడుస్తున్నందున, హైస్కూల్ ఎదురుగా ఉన్న మార్కెట్ కమిటీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని, కొత్తవలసలో నూతన రైతు బజార్ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఎస్.కోట రైతు బజార్ అభివృద్ధి కోసం తగిన నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ఆదిబాబు, దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు వెంకటరత్నాజీ, పిఎసిఎస్ ప్రతినిధి కోళ్ల శ్రీను, సర్పంచ్ మాకెన సీతారాం పాత్రుడు (నవీన్), ఏడీ శివశంకర్, కార్యదర్శి విజయబాబు, డైరెక్టర్లు గొంప దుర్గా ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - బొబ్బిలి

ఉద్యోగం రాలేదని మనస్తాపం చెందిన యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం సాయంత్రం బొబ్బిలిలో జరిగింది. రైల్వే హెచ్.సి ఈశ్వరరావు వివరాలు మేరకు బొబ్బిలి మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన బలగ మధు (23) ట్రిపుల్ ఐటి పూర్తి చేసినప్పటికీ ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపానికి గురై బొబ్బిలి మండలం గున్నతోటవలస రైల్వే గేటు సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుమారుడు మరణంతో తల్లిదండ్రులు శంకరరావు, అప్పలనర్సమ్మ కన్నీటి పర్యంతమవుతున్నారు. మృతునికి తమ్ముడు రవి ఉన్నాడు. మధు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అక్రమ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎక్సైజ్ అధికారుల దాడిలో 17 అక్రమ మద్యం బాటిళ్లు పట్టుబడినట్లు ఎక్సైజ్ సిఐ ఎం.వెంకట్రావు తెలిపారు. మండలంలోని గుషిణి, గుర్ల మండలంలోని చింతలపేటలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అక్రమ మద్యం సీసాలు కలిగిన వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 17 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

వ్యాన్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

వేపాడ: చోడవరం నుంచి ఎస్ కోటకు పంచదారతో వెళుతున్న వ్యాన్ వేపాడ కల్లాలు మలుపు వద్ద శనివారం బోల్తా పడింది. దీంతో డ్రైవర్ కృష్ణకు గాయాలయ్యాయి. వెంటనే స్థానిక పిహెచ్‌లో ప్రథమ చికిత్స చేయించి 104 వాహనంపై ఎస్ కోట ప్రభుత్వ ఆసుపత్రికి మెరుగైన వైద్య కోసం తరలించారు. హెచ్‌సి శేషాద్రి కిషోర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.